

పురుషామృగ వాహనంపై భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామి

పశుపతికి పురుషామృగ సేవ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమాలు జరిగాయి. అనంతరం చప్పర ఉత్సవం జరిగింది. పురుషామృగ వాహన సేవకు ఉభయకర్తలుగా డీ మోహన్, కస్తూరి దంపతులు, కాత్రా వెంకటకృష్ణమూర్తి ధర్మాదాయం నుం చి దేవస్థానం నిర్వహించాయి. కాగా, మూలస్థానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆలయ ఈవో ర్వభూమి శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆహ్వానించారు. ఆలయ మర్యాదలతో మంత్రిని సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు.



నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న సీఎం చంద్రబాబు , చిత్రంలో టీడీపీ నేత బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

'బీద' వివాహ వేడుకలో సీఎం చంద్రబాబు

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడు వివాహ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఆదివారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన బీద గోకుల రిష్వంత్-దివిజ వివాహానికి సీఎం విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ముందుగా వారికి పుష్పగుచ్ఛం అందచేసి, కొద్దిసేపు ముచ్చటించారు. మధ్యాహ్నం 1.15 గంటలకు నెల్లూరుకు విచ్చేసిన చంద్రబాబుకు హెలీప్యాడ్ వద్ద మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్ ఇతర అధికారులు, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన వీపీఆర్ కన్వెన్షన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎంపీ బీద మస్తాన్‌రావు, వారి కుటుంబ సభ్యులు సీఎంకు సాదర స్వాగతం పలికారు. సుమారు గంటపాటు బీద రవిచంద్ర కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం.. మధ్యాహ్నం 2.15 గంటలకు తిరుగుపయనమయ్యారు. ఈ వేడుకలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్, కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా రాష్ట్రంలోని నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు బీద కుమారుడి వివాహ వేడుకకు తరలివచ్చారు.

● ప్రశాంతంగా ముఖ్యమంత్రి పర్యటన

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి): పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా సీఎం చంద్రబాబు పర్యటన ముగిసిందని ఎస్పీ జీ. కృష్ణకాంత్ పేర్కొన్నారు.సీఎం పర్యటన ప్రశాంతంగా జరిగేందుకు సమయ పాలనతో బందోబస్తు నిర్వహించిన హోంగార్డు నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. సహకరించిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అన్నీ విభాగాల అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలని ఎస్పీ తెలిపారు.





సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అభివాదం చేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, పక్కన రాజ్యసభ సభ్యుడు బీఎంఆర్, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పీ కృష్ణయ్య

క్వార్ట్జ్ అక్రమార్కులపై కొరడా

- ఎట్టకేలకు కేసు నమోదు
- రుస్తుం మైన్స్‌లో తవ్వకాలపై గనుల శాఖ డీడీ ఫిర్యాదు
- ఏడాది తర్వాత చర్యలకు అధికారుల సన్నద్ధం
- వైసీపీ నేతలు పేర్నాటి, మరికొందరిపై అభియోగాలు
- మిగిలిన అక్రమార్కుల పరిస్థితేమిటో...?

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దోపిడీ అంటే ఎలా ఉంటుంది... అందులోనూ క్వార్ట్జ్ దోపిడీ ఎలా చేయవచ్చు... అనేది వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరూపణ అయింది. వందలు, వేలు దాటి లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను గత ప్రభుత్వంలో కొల్లగొట్టారు. ఈ విషయం మైనింగ్‌శాఖ విచారణలో తేటతెల్లమైంది. ఏకంగా 25 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా క్వార్ట్జ్‌ను అక్రమ మార్గంలో దేశం దాటించినట్లు నిర్ధారించారు. ఇందుకు గానూ ఏకంగా రూ.267 కోట్లకుపైగా జరిమానాలు విధించడం దేశావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే నాడు అంత పెద్ద స్థాయిలో అక్రమాలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆఖరుకు విచారణలో అక్రమాలు బట్టబయలైనా ఒక్కకేసంటే ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు.

● అక్రమాలపై దృష్టి

అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వార్ట్జ్ అక్రమాలపై దృష్టి పెట్టింది. నాడు బరితెగించి ప్రజాసంపదను కొల్లగొట్టిన అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా తొలుత రుస్తుం మైన్స్‌లోకి అక్రమంగా చొరబడి క్వార్ట్జ్‌ను తరలించిన వైసీపీ నేతలపై మైనింగ్ డీడీ కేసు నమోదు చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 697, 699, 751/2, 759/1, 759/2, 924, 925లలోని ప్రభు త్వ భూముల్లో 2023 డిసెంబరు 15కా ముందు అక్రమంగా క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్‌ను తవ్వి తరలించుకు వెళ్లారని మైనింగ్ డీడీ బాలాజీ నాయక్ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీకి చెందిన నాయకులు పేర్నాటి శ్యామ ప్రసాద్‌రెడ్డి, వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిలు ఈ అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ మేరకు పొదలకూరు స్టేషన్‌లో సెక్షన్లు 447, 427, 379 రెడ్‌విత్ 34 ఐసీపీ, 3 పీడీపీపీఏ, 21(1), 21(4) ఎంఎండీఏఆర్‌ఏ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రభుత్వ భూముల్లో భారీ ఎత్తున వెలికితీసిన క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ ఖనిజాలను చెన్నై పోర్టు మీదుగా చైనాకు తరలించినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న తెల్లరాయి

● మిగిలిన వారి పరిస్థితేమిటి..?

వైసీపీ ప్రభుత్వంలో క్వార్ట్జ్ దోపిడీ ఎలా జరిగిందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నికలకు ముందు రెండేళ్లపాటు విచ్చలవిడిగా జాతిసంపద చైనాకు తరలిపోయింది. నాడు ఎన్ని ఫిర్యాదులు చేసినా.. ప్రజలు ఆందోళనలు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు. నాటి ప్రతిపక్ష టీడీపీ నేతలు అక్రమ మైనింగ్ జరిగే ప్రాంతాలకు వెళ్లి ఆందోళనలు చేసినా, ప్రభుత్వం స్పందించలేదు. ఆఖరుకు అప్పట్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంతో పాటు వాహనాలను పట్టుకున్నారు. వాటిని ముందుకు కదలనీయకుండా సత్యాగ్రహ దీక్ష చేశారు. మూడు రోజుల పాటు ఈ దీక్ష కొనసాగితే ఒక్కరంటే ఒక్క అధికారి కూడా ఆ దరిదాపులకు వెళ్లే సాహసం చేయలేకపోయారంటే నాటి పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. చివరకు సోమిరెడ్డి దీక్షను అర్ధరాత్రి వేళ భగ్నం చేశారు తప్ప... ఆయన అడ్డుకున్న ఒక్క వాహనాన్ని కూడా సీజ్ చేయలేదు. ఇక చేసేది లేక కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి అక్కడి నుంచి సమాధానం ఇవ్వాలంటూ అడిగితే గానీ, పొదలకూరు మండలంలో క్వార్ట్జ్ దోపిడీ ఆగలేదు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎన్నికలకు ముందు క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై విచారణ జరిగింది. ఏడు జిల్లాలకు చెందిన మైనింగ్ అధికారులను జిల్లాలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై విచారణకు నియమించారు. వారు నెల పాటు సర్వే చేసి జిల్లాలో 25.50 లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్ అక్రమంగా తరలినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి 286 కేసులను నమోదు చేశారు. అందుకు గానూ అక్రమార్కులకు రూ.267.13 కోట్లు పెనాల్టీ విధించారు. ఇలా పెనాల్టీలు విధించిన వారిలో మెజారిటీ భాగం వైసీపీకి చెందిన వ్యక్తులే. అయితే తాజాగా రుస్తుం మైన్స్‌లో అక్రమ తవ్వకాలపై కేసులు పెట్టిన మైనింగ్ అధికారులు.. మిగిలిన అక్రమ మైనింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తిగా మారింది. నాటి విచారణ నివేదికల ప్రకారం జిల్లాలో 286 చోట్ల అక్రమ మైనింగ్ జరగ్గా.. అందుకు పాల్పడిన వారందరిపైనా కేసులు నమోదు చేయాల్సి ఉంది. కాగా తాజాగా మైనింగ్ డీడీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదలకూరు పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన కేసు వివరాలను చెప్పేందుకు కూడా పోలీసులు జంకుతుండడం గమనార్హం.

గ్రూప్-2 పరీక్షలకు 93 శాతం హాజరు

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు 93 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 3548మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 3546 మంది హాజరయ్యారు. రెండు సెషన్స్‌లో హాజరు శాతం 93శాతంగా ఉంది. అయితే ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్‌కు 4102 మంది క్వాలిఫై కాగా, హాల్‌టికెట్లను 3815 మంది మాత్ర మే డౌన్‌లోడ్ చేసుకోవడం గమనార్హం. కాగా ఏడు కేంద్రాలను లైజనింగ్ ఆఫీసర్, కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తనిఖీ చేశారు.



నగరంలోని వీఆర్ పీజీ సెంటర్‌లో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న అధికారులు



దివ్యాంగుడిని పరీక్ష హాలులోకి మోసుకు వెళ్తున్న పోలీసులు

- మిగిలిన తాగునీటి పైపులైన్లను పూర్తి చేస్తాం..
- పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడి

ఏప్రిల్ నుంచి భూగర్భ డ్రైనేజీ పనులు

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో అపరిష్కృతంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల పనులను ఏప్రిల్ నుంచి తిరిగి ప్రారంభించి, త్వరితగతిన పూర్తిచేస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నగరంలోని మహబూబ్‌ఖాన్ పార్కులో ఆట వస్తువులు, జిమ్ పరికరాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో తాము 90 శాతం వరకు యూజీడీ, తాగునీటి పైపులైన్ల పనులను పూర్తి చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఒక్కశాతం కూడా ముందుకు తీసుకెళ్లలేదని దుయ్యబట్టారు. హడ్కో నుంచి రూ. 165 కోట్లు నిధులు సమీకరిస్తున్నామని, వాటితో ఏప్రిల్ నుంచి పనులు మొదలుపెడతా మన్నారు. నెల్లూరులోని అన్నీ పార్కుల్లో రానున్న మూడు నెలల్లో జిమ్, ఆటవస్తువులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి రాబట్టిన నగదును, వారి అవసరాలకే ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు.



కలెక్టరేట్ సమీపంలోని మహబూబ్‌ఖాన్ పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, తదితరులు

సంతపేటలోని గుంటబడిలో మూడున్నర ఎకరాల్లోని ఆట స్థలాన్ని ఆధునికీకరించి క్రీడలకు ఉపయోగ పడేలా పనులు చేయిస్తున్నామన్నారు. అనంతరం గుంటబడి, ఇతర ప్రాంతాల్లోని పార్కులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ టీ అనురాధ , టీడీపీ నాయ కులు విజేతరెడ్డి, మధు, శైలజ, విజయ భాస్క ర్‌రెడ్డి, నత్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాసుల కోసం.. విప్పాలి గళం !

- నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- నిధుల కోసం సాగునీటి ప్రాజెక్టుల ఎదురుచూపులు
- అసంపూర్తిగా అభివృద్ధి పనులు
- ఆశలన్నీ శాసనసభ్యులపైనే...

నెల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు సోమవారం (నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. గత ఏడాది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో ముగిసింది. దీంతో ప్రాజెక్టులకు నిర్దిష్ట కేటాయింపులు జరగలేదు. అయితే ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ నిధులు ఎమ్మెల్యేలు సాధించాలని కోరుతున్నారు. ప్రధానంగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి నిధులు రాబట్టాల్సిన బాధ్యత వారిపై ఉంది. మరి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పుతారా..? వారివారి ప్రాంతాలకు ఏ మేరకు నిధులు సాధిస్తారు..? అన్నది ఆసక్తిగా మారింది.

● ఆత్మకూరు నియోజకవర్గంలో సోమశిల ఆఫ్రాన్ పనులు కూటమి ప్రభుత్వంలో మొదలయ్యాయి. కొంత వేగంగా జరిగినా ఆ తర్వాత వేగం తగ్గింది. బిల్లుల సమస్యతోనే కాంట్రాక్టర్ పనులు చేయడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రానున్న బడ్జెట్‌లో సోమశిల ఆఫ్రాన్‌తోపాటు ప్రాజెక్టు మరమ్మతులకు అవసరమైన నిధులు సాధించాల్సి ఉంది. సోమశిల హైలెవల్ కెనాల్ పనులు కూడా మళ్లీ మొదలుపెట్టాల్సి ఉంది. ముఖ్యమైన రిజర్వాయర్లను ఈ మధ్యలో నిర్మించాల్సి ఉంది. వీటికి నిధులు సాధించడం అత్యవసరం.

● కోవూరు నియోజకవర్గంలో మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ పనులు బిల్లుల సమస్యతో ఆగిపోయాయి. ఈ వర్కుకు రానున్న బడ్జెట్‌లో నిధులు రాబడితే పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు పనులు మొదలుపెట్టించవచ్చు. అలానే ముదివర్తి-ముదివర్తిపాలెం కాజ్ వే పనులు కూడా బిల్లుల సమస్యతో ముందు, వెనుక అన్నట్లు సాగుతున్నాయి. పూర్తి కావాలంటే ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరపాలి.

● కావలి నియోజకవర్గంలో కేటీఎస్, డీఆర్-డీఎం కాలువలు, సీబీఆర్ బైపాస్ కెనాల్, చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఇవి పూర్తయితే చివరి ఆయకట్టు వరకూ నీరందించవచ్చు. అందుకు నిధులు అవసరం. అలానే కావలిలో తాగునీటి సమస్యపై కూడా ఎమ్మెల్యే గళం విప్పాలని స్థానికులు కోరుతున్నారు.

● నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి సర్వేపల్లి కాలువ లైనింగ్ పనుల పూర్తికి నిధులు సాధించాలి. అలాగే రెండోఫేజ్ పనులు కూడా చేపడితే నగరంలో కాలువ లైనింగ్ పూర్తవుతుంది. ఇకపోతే నగరంలో ఉన్న ప్రధాన డ్రెయిన్లను 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత పనులు ఆగిపోయాయి. మళ్లీ నిధులు సాధించి డ్రెయిన్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. అలానే నగరంలో అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలను కూడా పూర్తి చేసేందుకు నిధులు తీసుకురావాలి. పొట్టేపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూడా రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

● సర్వేపల్లి నియోజకవర్గంలో కీలకమైన బండేపల్లి-డేగపూడి కాలువ నిర్మాణ పనులను మళ్లీ పట్టాలెక్కించాలంటే నిధులు అవసరం. అలానే సోమశిల దక్షిణ కాలువ కొనసాగింపు పనులకు కూడా నిధులు కేటాయించాల్సి ఉంది. కనుపూరు కాలువ డీప్‌కట్ నిర్మాణం కూడా చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. ఈ పనికి కూడా నిధులు సాధించేలా సర్వేపల్లి, రూరల్ ఎమ్మెల్యేలు కృషి చేయాల్సి ఉంది.

● కందుకూరు నియోజకవర్గంలో రాళ్లపాడు ప్రాజెక్టు నిర్వహణకు నిధులు అవసరం. నిర్వహణ లేకపోవడంతో గతేడాది కుడి కాలువ గేటు విరిగిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం క్రస్టు గేట్లను ఆపరేట్ చేయడం కూడా కష్టంగా మారింది.



న్యూస్ బాక్స్

సోమశిలలో 60.550 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 1,021 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 60.550 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,480, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరులో 52.39 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : రాపూరు మండలంలో ఉన్న కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 52.39 టీఎంసీలు ఉందని కండలేరు డ్యాం ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్ ఫ్లో 1215 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు.



వేదాయపాళెం పోలీసు స్టేషన్ ప్రాంగణంలో బాధితులు

న్యాయం చేయండి

● పోలీసు స్టేషన్‌కు చేరుకున్న ఉమ్రా యాత్ర బాధితులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్రా యాత్ర పేరుతో మోసపోయిన బాధితులు ఆదివారం రాత్రి నెల్లూరులోని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. యాత్ర పేరుతో వసూళ్లకు పాల్పడి మోసం చేసిన ట్రావెల్స్ సంస్థ ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమా చారంతో బాధితులు అక్కడకు చేరుకొని న్యాయం చేయాలని కోరారు. పోలీసుల కథనం మేరకు... జిల్లాకు చెందిన పలువురు ఉమ్రా యాత్రకు వెళ్లేందుకు చెన్నైకు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థను సంప్రదించారు. ఆ సంస్థ ప్రతినిధులు యాత్రకు వెళ్లేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.55 వేలు చొప్పున 140 మంది నుంచి నగదు కట్టించుకున్నారు. వీసాలు పంపుతామని చెప్పి రోజులు గడుస్తున్నా రాకపోవడంతో బాధితులు సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో మోసపోయామని గ్రహించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంగళరావు నగర్ ఎన్‌సీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఖాదర్ షరీఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు గతనెల 17న కేసు నమోదు చేశారు. సంస్థ ప్రతినిధులు జాఫర్, షాకీర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కోయంబత్తూరులో సైతం పలువురిని ఇదే తరహాలో మోసగించినట్లు తెలిసింది. అక్కడి బాధితుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో నెల్లూరు జిల్లాలో యాత్రకు వెళ్లాలనుకునే వారిని మోసం చేసి వారి వద్ద కట్టించుకున్న నగదు కోయంబత్తూరు బాధితులకు అందజేసి నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని సమాచారం. నెల్లూరు బాధితుల నుంచి ఒత్తిడి రావడంతో విజయవాడలో ఉమ్రాయాత్ర పేరిట వసూళ్లు చేసి ఇక్కడి వారికి డబ్బిచ్చే పనిలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల లెక్కల ప్రకారం జిల్లాలో 140 మంది నుంచి సుమారు రూ.70 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 25 నుంచి మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న జరుగుతుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	93
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8286
వెండి కిలో ధర	రూ. 99,400
వెండి ఒక గ్రాము	రూ.102.40

వెయ్యేళ్ల నాటి ప్రాచీన గ్రామం సిద్దనకొండూరు

● వెలుగులోకి 800 ఏళ్లనాటి శిలాశాసనం

కలిగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దనకొండూరులో చోళులకాలంనాటి శిలాశాసనాన్ని కనుగొన్నట్టు భారతీయ పురావస్తుశాఖ, చెన్నై శాసనవిభాగాధిపతి డాక్టర్ ఎం ఏసుబాబు, చరిత్ర కారుడు రసూల్‌బాబు తెలిపారు. సేకరించిన వివరాల మేరకు, సిద్దనకొండూరు గ్రామవాసి పాలిశెట్టి లక్ష్మీకాంతారావు(46) ఇచ్చిన సమాచారం మేరకు సిద్దనకొండూరు స్థానికులతో కలిసి ఆదివారం పర్యటించిన వారు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో ఉన్న శిలాశాసనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిలాశాసనం 13వ శతాబ్దం కాలంనాటిదని, చోళరాజైన మనుమసిద్ధి మహారాజు కుమారుడు మనుమగండ గోపాలుడికి, సిద్దనకొండూరును పాలించే నూంకి నాయకుడి కుమారుడు సిద్దప్పనాయుడికి ఈ ప్రాంతాన్ని పరిపాలించమని కోరుతూ క్రీస్తు శకం 1290 సంవత్సరం విజయదశమి నాడు అనుమతి జారీ చేశారని పేర్కొన్నారు.

అంతేకాక ఈ శాసనంలో సిద్దేశ్వరుడి ఆలయానికి చెరువు మాన్యాన్ని దానం ఇచ్చినట్లుగా రాయబడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిద్దేశ్వర ఆలయ చైర్మన్ రూపిశెట్టి రామభద్రరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత నందనవనం ప్రభాకరరావు, అంబటి శివకుమార్, మురుగమ్మ శ్రీకాంత్, ధనిశెట్టి మాధవరావు, నేతి భాను మల్లిక్ పాల్గొన్నారు.



శాసనాన్ని పరిశీలిస్తున్న పురావస్తుశాఖ అధికారులు

అల్లుకున్న ప్రమాదం



విద్యుత్ స్తంభానికి చుట్టుకుని ఉన్న పిచ్చి మొక్కల తీగలు

స్థానిక ఆర్డీవో కార్యాలయం సమీపంలోని 11కేవీ విద్యుత్ స్తంభానికి పిచ్చితీగలు అల్లుకుని ప్రమాదం పొంచి ఉంది. కరెంట్ సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే స్తంభం ఎక్కేందుకు ట్రాన్స్‌కో సిబ్బంది జంకుతున్నారు. ఏదైనా ఇబ్బందులు రాకముందే ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి స్తంభానికి, తీగలకు అల్లుకున్న పిచ్చి తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీకామాక్షిదేవి సమేత కోటేశ్వరస్వామి ఆలయం

నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

చేజర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటితీర్థం గ్రామంలో పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీకామాక్షిదేవి సమేత శ్రీ కోటేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి మార్చి 2వతేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. సోమవారం ధ్వజారోహణం కార్యక్ర మంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మి పార్థసారధి, ఈవో ప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్యూరు గిరినాయుడు సహకారంతో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా బ్రహ్మోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.



తిప్ప పోలీసుల అదుపులో టిప్పర్లు

గ్రావెల్ తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు

బిట్రగుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అల్లిమడుగు పంచాయతీ కడనూతల చెరువులోని గ్రావెల్‌ను కావలికి చెందిన కొందరు అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్థులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. తవ్వకాలు జరుగకుండా నిలిపివేసి స్థానిక పోలీసులకు రెండు టిప్పర్లు, జేసీబీ అప్పగించినట్లు నాటకరాణి జనార్థన్, కావలి సుబ్బారావు, పర్రి రవి తెలిపారు. ఇదివరకు కూడా బయట గ్రామాలకు చెందిన కొందరు ఇలా గ్రావెల్ తరలిస్తుండగా హెచ్చరించామన్నారు. గ్రామా నికి సంబంధించిన వారికి మట్టి అవసరమై పక్కఊరి వారిని అడిగితే ససేమి రా లేదని అంటు న్నారని మా గ్రామంలో ఇరత ప్రాంతాలకు చెందిన వారు ఏ విధంగా మట్టి తరలిస్తారని ప్రశ్నిం చారు. అధికారులు స్పందించి గ్రావెల్ తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ భోజ్యను వివరాలు కోరగా సీఎం బందోబస్తులో ఉన్నట్లు తెలిపారు.

యోగాలో గమన్ బృందానికి ప్రథమ స్థానం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తడలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా యోగా పోటీల్లో నెల్లూరుకు చెందిన గమన్ బృంద అండర్-14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. విజేతలకు కేరళ యోగ పీఠ్ అధినేత రాధాకృష్ణ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో యోగా కోచ్ ప్రసన్న కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాతతో అత్యధిక మార్కులు


● రానున్నది పరీక్షల కాలం ● హ్యాండ్ రైటింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ అవసరం

● వ్యక్తిత్వానికి అద్దం పట్టే దస్తూరి

చేజర్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సమాధానం కచ్చితంగా రాసినా, పేపరుదిద్దేవారికి అది అర్థమైనప్పుడే నూటికి నూరు మార్కులకు అవకాశం ఉంటుంది. ఇందుకు చక్కటి చేతిరాత చాలా అవసరం. ఎంత బాగా చదివినా.. ఎంతగొప్పగా పరీక్ష రాసినా అక్షరాలు అర్థం కాకుంటే సమాధాన పత్రాలు దిద్దేవారికి కొంత ఇబ్బందిగా ఉంటుంది. ఆ ప్రభావం మార్కులపై పడు తుంది.

● మంచి మార్కులు రావాలంటే..

అందమైన చేతిరాత విద్యా ర్థుల భవితను నిర్దేశిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు గజిబిజిగా కాకుండా, అర్థమయ్యేలా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. అలాగే కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చేతిరాతపై పట్టు సాధించవచ్చునని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. త్వరలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు జరగనున్న దృష్ట్యా విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు సూచిస్తు న్నారు. పరీక్షలు సమీపిస్తుం డడంతో ప్రస్తుతం విద్యార్థు లంతా చదువుపైనే దృష్టి పెట్టారు. అలాగే చేతి రాతపై కూడా దృష్టి సారిస్తే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చునని విద్యారంగ నిపుణులు తెలియజేస్తున్నారు. ఇప్పటి నుంచే కొట్టివేతలు లేకుండా చక్కగా రాసే అలవాటు చేసుకోవాలి. పరీక్షలో అద్భుతంగా సమాధానాలు రాసినా, అక్షరాలు బాగా లేకపోతే పేపర్లు దిద్దే ఉపాధ్యాయులకు సరిగ్గా అర్థంకాక మార్కులు తగ్గించే అవకాశం ఉంది.





● చదవాలని అనిపించాలి...

విషయం ఏదైనా ముత్యాల వంటి అక్షరాలు చూస్తే చదవాలనిపించాలి. సాకేంతికంగా ఎన్ని మార్పులు వచ్చినా చేతిరాత ప్రాధాన్యం ఎన్నటికీ తగ్గదు. మెరుగైన చేతిరాతతో వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేసుకోవచ్చు. అందమైన అక్షరాల ద్వారానే భావాన్ని వ్యక్తీకరించగలం. ఉపాధ్యాయుడు ఏ అక్షరం వద్ద విద్యార్థి తప్పు రాస్తున్నాడో గుర్తించి సరిచేస్తే ఆ విద్యార్థి మళ్లీ ఆ తప్పు చేయడు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా చేతిరాత మెరుగు పరుచుకోవడం ఏమంత కష్టం కాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ముఖ్యంగా అక్షరాల సైజు ఒకేలా ఉండేలా చూసుకోవాలి.
- అక్షరాలు, పదాల మధ్య సమాన దూరం ఉండేటట్టు జాగ్రత్త పడాలి.
- అక్షరాలను ఒకే గీతపై ఉండేలా చూసుకోవాలి.
- తప్పులు లేని విధంగా ఒత్తులను సరిగా వినియోగిస్తూ రాయాలి.
- కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకూడదు. అలా ఉంటే అవి చూసేవారికి, సమాధానాలు దిద్దేవారికి ఇబ్బందిగా అనిపించే అవకాశం ఉంది.
- సాధనతో వేగంతో కూడిన రాతను ప్రయత్నించాలి.
- పాఠశాలలో అదనపు తరగతులకు హాజరై చేతి రాతపై సాధన చేయాలి. అప్పుడే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది.



కార్పొరేషన్ కార్యాలయంలో నూతన చెత్తకుండీ

చెత్త కుండీలొచ్చాయోచ్!

నెల్లూరులో ప్రజలను పట్టిపీడి స్తున్న చెత్త సమస్య కొంత వరకైనా పరిష్కారం కానుంది. రెండు మూడేళ్లుగా చెత్త కుండీలు లేక అనేక ప్రాంతాల్లో రోడ్ల పైనే చెత్త పోగవుతోంది. ఈ క్రమంలో కార్పొరేషన్ అధికారులు కుండీల కొనుగోలుకు టెండర్ల పిలవ డంతో ఆ ప్రక్రియ పూర్తయింది. తొలివిడతలో తయారీదారుల నుంచి 70 కుండీలను తెప్పించి న అధికారులు పలు ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తున్నారు. మలి విడతలో మరికొన్ని కుండీలు వస్తాయని అధికారులు తెలిపారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో జిల్లాకు ద్వితీయ స్థానం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా మహిళల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. తిరుపతి సమీపంలోని చంద్రగిరిలో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన 12వ రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ పురుషులు, స్త్రీల క్రికెట్ ఛాంపియన్ షిప్‌లో జిల్లా మహిళల జట్టు ప్రతిభ చాటింది. కెప్టెన్ సాత్వికరెడ్డి ఉమెన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకున్నారు. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారి ణులను జిల్లా టెన్నిస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు డీ హరిరెడ్డి, యుగంధర్, ఉపాధ్యక్షుడు లీలాధర్‌రెడ్డి, నిర్వాహక కార్యదర్శి అజయ్, హేమంత్ అభినందించారు.



ద్వితీయస్థానంలో నిలిచిన నెల్లూరు మహిళల జట్టు

పెంచలకోన నిత్యాన్నదానానికి విరాళాలు

రాపూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి నాయుడుపేట వాస్తవ్యులు దివంగత సిద్ధంశెట్టి నరసింహులు జ్ఞాపకార్థం కుమార్తె, కుమారుడు జనని, రాంచరణ్ రూ.1,00,001 నగదు రూపంలో విరాళం అందించారు. అలాగే చిట్వేల్ మండలం సీఎం రాచపల్లి గ్రామ వాస్తవ్యులు పందేటి వేదాన్ష్, మోక్షిత దంపతులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,00,009 అందించారని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న నాయుడుపేట వాసి రాంచరణ్



నెల్లూరు బ్రాంచి ఐసీఏఐ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న హిమహాసిని

ఐసీఏఐ నెల్లూరు బ్రాంచి నూతన కమిటీ నియామకం

● సభ్యులతో వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

వెంకటాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బ్రాంచి ఎస్ఐఆర్‌సీ (సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్) ఆఫ్ ఐసీఏఐ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్)కి ఆదివారం కొత్త కమిటీ నియామకం చేపట్టారు. వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఉన్న ఐసీఏఐ భవన్‌లో కొత్త కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. నూతన చైర్మన్‌గా ఎస్.హిమహాసిని, వైస్‌చైర్మన్‌గా ఉదయ్‌తేజ, కార్యదర్శిగా సీహెచ్ వెంకట్ సందీప్, కోశాధికారిగా ఎన్. మణికంఠ శ్రీనివాస్, ఎంసీ మెంబర్‌గా వీవీ సాయిశశి ప్రీతం, విద్యార్థి విభాగం చైర్మన్‌గా జీ.సాయిచరణ్‌లు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీఏఐ వైస్‌చైర్మన్ డీ.ప్రసన్నకుమార్ కొత్త కమిటీ సభ్యులతో ప్రమాణా స్వీకరం చేయించి,అనంతరం సభ్యులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఐసీఏఐ భవన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం నెల్లూరు బ్రాంచి ఎస్ఐఆర్‌సీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ ఎస్.హిమహాసిని మాట్లాడారు. ఐసీఏఐ అభ్యున్నతికి కొత్త కమిటీ తమవంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ హ్యాండ్‌బాల్‌కు రమేష్



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో ఈనెల 28 నుంచి జరగనున్న ఇం టర్ వర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే వీఎస్‌యూ జట్టుకు నగరంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థి ఓ రమేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాల యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో రమేష్ శిక్షణ పొందుతున్నాడన్నారు. పోటీల్లో ఉత్తమంగా రాణించి కళాశాల, వీఎస్‌యూ ప్రతిష్ఠను ఇనుమడింప చేయాలని ఆకాంక్షిం చారు. కార్యక్ర మంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం రవీంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

మనుబోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మనుబోలు క్రాస్‌రోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలి యని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సమయంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. మృతుడి శరీరంపై టీషర్టు, డ్రాయర్ తప్ప మరేమి ఆనవాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. శివరాకేష్ తెలిపారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జాతీయ స్థాయి మాస్టర్స్ క్రీడా పోటీల్లో

జిల్లావాసులకు పతకాలు

కావలి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ జింఖానా మైదానంలో శనివారం నుంచి జరుగుతున్న 7వ జాతీయస్థాయి మాస్టర్స్ క్రీడాపోటీల్లో జిల్లావాసులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన గద్దె వెంకటేశ్వర్లు 55ప్లస్ విభాగంలో 100మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 200మీటర్లు..400 మీటర్ల పరుగు పందేంలో వెండి పతకాలు సాధించారు. 50ప్లస్ విభాగంలో వాయిల శ్రీనివాసులు 200మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. పి.సుధీర్ 100మీటర్లు, 800మీటర్లు, 1500మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ క్రీడాపోటీల్లో కూడా సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. తమకు ప్రోత్సా హమందించిన జిల్లా, రాష్ట్ర మాస్టర్స్ అసోసియేషన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



సర్టిఫికెట్లు, మెడల్స్‌తో గద్దె వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుధీర్

పెన్షనర్ల సమస్యలకు తొలి ప్రాధాన్యత

జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య



ప్రసంగిస్తున్న జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమస్యలను ఆడిట్ శాఖ మొదటి ప్రాధాన్యతగా భావించి సత్వరం పరిష్కరిస్తుందని జిల్లా ఆడిట్ అధికారి ఎం తిరుపతయ్య హామీ ఇచ్చారు. ఆదివారం భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ భవనంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెన్షన్ బకాయిలు కోసం పెన్షనర్స్ సంఘం బలోపేతం కావాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ మాట్లాడుతూ పెన్షనర్స్‌కు రావాల్సిన డీఆర్ బకా యిలు, 11వ పీఆర్సీ బకాయిలు, 2డీఆర్‌లను ప్రభుత్వం తక్షణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎనెల్ ఆసుపత్రి వైద్యులు ఆరోగ్య సలహాలిచ్చారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీవీఎస్ మూర్తి, కోశాధికారి ఐ హజరత్తయ్య, అసోసియేట్ కార్యదర్శి సీహెచ్ రఘునాథ్, గోపాల్, వీరేంద్రనాథ్, ఆత్మకూరు, పొదలకూరు యూనిట్ అధ్యక్షుడు శ్రీరాములు, కోటేశ్వరరావు, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ఏఎస్ పేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదీప్ తెలిపారు. ఈనెల 24 నుంచి మార్చి 31వ తేదీలోగా ఓసీలు, బిసిలు 150 రూపాయలు, ఎస్సీలు, ఎస్టీలు 75రూపాయలు ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 20న తేదీన పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా మల్లేశ్వరస్వామికి హంస వాహనసేవ


హంస వాహనంపై విహరిస్తున్న మల్లేశ్వరస్వామి

కావలి టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతూరు రుద్రపాద క్షేత్రంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని వారికి ఆదివారం హంస వాహన సేవలందించారు. శివాలయ ప్రధాన అర్చకులు శశిగురుకుల్ పర్యవేక్షణలో ఈ గ్రామోత్సవం జరిగింది. ఉదయం హోమం, బలిహరణ పల్లకీ సేవ, విశేష అభిషేకార్చనలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

●సంగం: మండలంలోని వంగల్లులో భీమేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం తెల్లవారుజామున భీమేశ్వరస్వామి హంస వాహనసేవ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా శ్రీ కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను పూలతో అలకరించారు. ఆలయ పూజారి కిషోర్ కుమార్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఘనంగా పాలేటి గంగమ్మకు పొంగళ్లు


పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):స్థానిక పెన్నానది ఒడ్డున వెలసి ఉన్న పాలేటి గంగమ్మ ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజ నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామలింగేశ్వరుడి ఉత్సవాలను జయప్రదం చేయండి


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన దుత్తలూరు సంజీవ శిఖరంపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవం, గ్రామోత్సవంతోపాటు భక్తుల సౌకర్యార్థం అన్నదాన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈపూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మంత్రి ఆనం రామనారాణరెడ్డి, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. కావున దుత్తలూరు మండలంతోపాటు పరిసర మండలాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

టీడీపీ పాలనలో అవినీతికి ఆస్కారం లేదు

● ఎమ్మెల్యే కాకర్లను విమర్శిస్తే సహించం : టీడీపీ నేతల ఆగ్రహం




వింజమూరులో మాట్లాడుతున్న విజయరామిరెడ్డి, వరికుంటపాడులో టీడీపీ నేతలు...

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి విలయ తాండవం చేసిందని, తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం అన్నారు. ఆదివారం స్థానిక మాజీ సర్పంచు ఆంద్రా బాలగురవారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్లపై కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ ఇన్‌చార్జి రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలకు ఏమాత్రం బెదిరేది లేదన్నారు. అనంతరం అలాంటి కథనాలు ప్రచురించిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొడుగులూరి మాలకొండ్రాయుడు, గండిపాళెం ప్రాజెక్టు చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, మాజీ జడ్పీటీసీ భోగినేని శ్రీనివాసులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అరవ కార్తీక్, గుమ్మల్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలు అర్థరహితం : మాజీ ఎమ్మెల్యే కంభం

●వింజమూరు : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం కంభం విజయరామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు గణపరం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు బందారు సత్యనారాయణ, శ్రీనివాసులు, నాగిరెడ్డి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరాధార అభియోగాలు మోపితే సహించం : బిజ్జం

●కలిగిరి : తెలుగుదేశం నాయకులపై నిరాధార అభియోగాలు మోపితే సహించమని టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో రేషన్‌బియ్యం అమ్ముకొని పార్టీ సభ్యత్వాలు చేసుకున్నారని, అగ్రిగోల్డ్ పొలాల నరికివేతపై ఎమ్మెల్యేకు సంబంధం ఉందని ఓ ఛానెల్‌లో వచ్చిన వార్తలను వారు తీవ్రంగా ఖండించారు. నిరాధార వార్తలపై స్థానిక ఎస్ఐ ఉమాశంకర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నేతలు బీవీ రామారావు, చీమల తాతయ్య, నరసింహనాయుడు, గన్నమనేని శ్రీనివాసులు, ఊసా మాల్యాద్రి, వెంగపనాయుడు, మాధవ, స్వర్ణ కొండయ్య, నిశ్శంకర సురేష్, లెక్కల రాంబాబు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో 'టీఆర్‌ఆర్' విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో తొలిసారి నిర్వహించిన అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీల్లో ప్రథమస్థానంలో నిలవటమే కాకుండా ఏడుగురు క్రీడాకారులు యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 28నుంచి మార్చి 4వరకు తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ యూనివర్సిటీ స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.


ఎంపికైన క్రీడాకారులతో అధ్యాపకులు

పశువైద్యం గగనం

● సకాలంలో వైద్యసేవలు అందక మూగజీవాల మృత్యువాత


వరికుంటపాడులో అర్థంతరంగా నిలిచిన అదనపు గది నిర్మాణం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మెట్ట ప్రాంతంలో ఏళ్ల తరబడి పశువైద్యం గగనంలా మారుతోంది. వైద్యసేవలు సకాలంలో అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వేసవి సమీపిస్తుండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజక వర్గాల్లో అధిక శాతం మంది గేదెలు, మూగజీవాలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. పాడిరైతులు తమ జీవాలను కాపాడుకునేందుకు పడ రాని పాట్లు పడుతున్నారు. ఆఫీసు సబార్డినేటర్ నుంచి పశువైద్యాధికారి పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్నాయి. దీంతో జీవాలను కాపాడు కోవాలనే ఆశతో వైద్యశాలలకు పరుగులు తీసిన రైతులకు నిరాశే మిగులుతోంది.

వెంటాడుతున్న వైద్యాధికారుల కొరత

నియోజకవర్గ కేంద్రంలోని ప్రాంతీయ వైద్యశాలలో సబార్డినేటర్ పోస్టు ఖాళీగా ఉంది. గండిపాళెంలో పశువైద్యాధికారి, సబార్డినేటర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో అక్కడ వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వరికుంటపాడుతో పాటు దుత్తలూరు మండలం నర్రవాడ, నందిపాడుల్లో వైద్యాధికారి, జూనియర్ వెటర్నరీ అధికారుల పోస్టులు వెక్కిరిస్తూనే ఉన్నాయి. సీతారామపురం మండలం బసినేనిపల్లిలో, వింజమూరు మండలం తమిదపాడు, గుండెమడగల పశువైద్యశాలల్లోను వైద్యాధికారుల కొరత వెంటాడుతూనే ఉంది. అలాగే ఆత్మకూరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి దాపురించింది. మర్రిపాడు మండలం అనంతసాగరం, తిక్కవరం, కంపసముద్రం వైద్యశాలల్లో పశువైద్యాధికారి పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు.

సమస్యల వలయంలో సిబ్బంది

కాగా, అరకొరగా ఉన్న సిబ్బంది సైతం సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన వసతులు లేకపోవడం, శిథిలావస్థకు చేరిన ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తించడం సవాల్‌గా మారింది. ప్రధానంగా సీతారామపురం, బసినేనిపల్లి, కుర్రపల్లి, గండిపాళెంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. వరికుంటపాడులో మరుగుదొడ్లతో పాటు ఏళ్ల తరబడి అర్థాంతరంగా నిలిచిన అదనపు గది పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోక నిరుపయోగంగానే దర్శనమిస్తోంది. దీంతో ఇరుకైన ఆ వైద్యశాల గదిలో విలువైన మందులను భద్రపర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మారుమూల ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పశువైద్యాధికారి, సిబ్బంది పోస్టులను భర్తీచేసి మెరుగైన వైద్యసేవలు అందించాలని పశుపోషకులు కోరుతున్నారు.

మండల సమావేశం రసాభాస


మండల సమావేశంలో ఎమ్మెల్సీ మాధవరావుతో టీడీపీ నేతల వాగ్వివాదం

లింగసముద్రం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో మండలంలో టీడీపీ నేతలకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ నేతలు ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, ఎంపీపీ పెన్నా కృష్ణయ్యలపై టీడీపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ సంఘటన జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ మాధవరావు కూడా హాజరయ్యారు. మొదటగా ఎమ్మెల్సీ మాధవ రావు, ఎంపీపీ కృష్ణయ్యలు 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగిన జమా ఖర్చుల వివరాలను చెప్పాలని ఎంపీడీఓ శ్రీనివాసులను ప్రశించారు. జమా ఖర్చుల వివరాలు లేకుండా సభను ఎలా నడుపుతారని మండిపడ్డారు. దీంతో సమావేశం బయట ఉన్న పలువురు టీడీపీ నేతలు సమావేశం జరిగే హాలులోకి వచ్చి గత నాలుగేళ్లలో చెప్పని జమా ఖర్చులు ఇప్పుడు అడగడం ఏమిటని, అలాగే అధికారులను బెదిరించడంపై వారు ఎమ్మెల్సీ, ఎంపీపీలను నిలదీశారు. గతంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నందున బిల్లులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు. చేపట్టనున్న పనులకు ఎంపీపీ కృష్ణయ్య తీర్మానాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందరు టీడీపీ నేతలు మీరు ఈ సభలో సభ్యులు కాదు కదా, మీకు ఆహ్వానం లేకుండా ఎలా సభకు వస్తారని మాధవరావును ప్రశ్నించారు. తాను ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీ అని తాను సమావేశంలో పాల్గొనే హక్కు ఉందన్నారు. ఈ సందర్భంగా మాధవరావుకు టీడీపీ నేతలకు తీవ్రస్థాయిలో వాదనలు జరిగాయి. అధికారులు చేసేదిలేక సమావేశాన్ని అర్థాంతరంగా ముగించేశారు.

కాగా, మండల సమావేశం అనంతరం రాత్రి 7గంటల సమయంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య చాంబర్‌లో ఎమ్మెల్సీ మాధవరావు విలేకరులతో మాట్లాడారు. తాను ఎప్పుడూ అభివృద్ధికి అడ్డుపడే వ్యక్తిని కాదని, మండలాభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో టీడీపీ నేతలు బొల్లినేని నాగేశ్వరరావు, వంకాయలపాటి మాల్యాద్రిలు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధికి నిధులు కేటాయిస్తే, గతంలో వైసీపీ నేతలు చేసిన పనులకు నిధులను ఇవ్వాలని అడగడాన్ని వారు తప్పుపట్టారు.

పారిశుధ్యం మెరుగుకు కావలిలో సరికొత్త ప్రణాళిక

● డంపర్‌బిన్‌ల స్థానంలో ఇనుప గ్రిల్స్
● రోడ్లపై చెత్త నిల్వ ఉండి కంపుకొట్టకుండా చర్యలు


చెత్త డబ్బాలు పెట్టేందుకు సిద్ధం చేస్తున్న ఇనుపమెస్‌లు

కావలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడా రోడ్లపై చెత్త కనిపించకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఇంటింటా సేకరించిన చెత్తను సమీపంలోని డంపర్‌బిన్‌లలో వేస్తున్నారు. ఆ డంపర్ బిన్ లను మున్సిపల్ కాంపాక్ట్ వాహనాలు వచ్చి తీసుకెళ్లేవి. అయితే ఆ డంపర్ బిన్‌లు సకాలంలో ఎత్తకెళ్లక పోయినా లేక అవినిండినా దాని చుట్టూ చెత్త నిల్వచేరి కంపుకొడుతున్నాయి. దీనికితోడు వ్యాపారులు, ప్రజలు ఇళ్లు, దుకాణాలకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు చెత్త ఇవ్వకుండా చెత్తను తీసుకొచ్చి డంపర్‌బిన్‌ల వద్ద కింద పోస్తుండటంతో ఆ ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు డంపర్‌బిన్‌ల స్థానంలో ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో ఇంటింటా సేకరించిన చెత్తను డబ్బాల్లో ఉంచి ఆ డబ్బాలను ప్రధాన సెంటర్లలోని ఇనుగ్రిల్‌లో పెట్టి వాటిని పందులు, కుక్కలు లాగకుండా వాటికి తాళాలు వేస్తారు. మున్సిపల్ వాహనాలు వచ్చి ఆ డబ్బాలలో ఉన్న చెత్తను వాహనంలో పోసుకుని ఖాళీ డబ్బాలను తిరిగి అక్కడే ఉంచి తాళాలు వేస్తారు. ఇంటింటా చెత్తను సేకరించిన వారు చెత్త డబ్బాలను తిరిగి అక్కడ పెట్టి, ఖాళీ డబ్బాలను తీసుకెళతారు. ఇలా చేయటం వలన ఎక్కడ రోడ్లపై చెత్త కనిపించ కుండా చేయవచ్చేనే ఆలోచనకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా తొలుత కావలి పట్టణంలోని 10వ వార్డులో శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రయోగం మంచిదైనా దాన్ని అమలు చేయడంలో అధికారులు చిత్తశుద్ధి ఎలా ఉంటుందో ప్రజలు ఎంత వరకు సహకరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

అనాథలను ఆదరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఫాతిమా

ఉదయగిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామీ హింద్ ఉదయగిరి శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి మదరసాలో రంజాన్‌కు స్వాగతం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా బాధ్యురాలు ఫాతిమాకౌసర్‌హుమైరవి, ఫాతిమా మహ్మద్‌లు మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైనదని, ఆర్థిక స్థోమత కలిగిన వారు అనాథలను ఆదరించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాఖ అధ్యక్షురాలు షేక్ అసియా, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో బుద్ధి వికాసం

వింజమూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం జరిగింది. ఇందులో హైదరా బాద్ మాస్టర్ శ్రీకాంత్ పాల్గొని ధ్యానంతో బుద్ధి వికసిస్తుందన్నారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 26వ తేదీ ఉదయం నుంచి 27 వరకు శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో అఖండ మౌన ధ్యానం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 70 మంది ధ్యానులతోపాటు శ్రీజ, హేమలత, లక్ష్మీ, స్వరాజ్యం, రాజేశ్వరి, జయప్రద, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మొక్కల పంపిణీ

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ ముత్యాల విజయ్‌చంద్ర ఆదివారం 20 మొక్కలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి పాఠశాలలో మొక్కలు నాటించారు. ఎన్ఆర్ఐను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు అభినందించారు.

క్రికెట్ మైదానం ఏర్పాటుకు కృషి

● కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రికెట్ క్రీడాకారుల కోసం ప్రత్యేక మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కందుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. టోర్నీ విజేతలకు రూ.లక్ష, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.50వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మస్తాన్, చిరంజీవి, రియాజ్, నాగరాజు, టీడీపీ నాయకులు చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, గొంది నరసింగరావు, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం


వెంగారెడ్డిపాళెంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నట్లు ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ అధికారి నయీం తాజ్ హసన్ తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని వెంగారెడ్డిపాళెంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి తడి, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టించి పంచాయతీకి ఆదాయ వనరులు చేకూర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ సీనియర్ నాయకుడి మృతి

● పలువురి సంతాపం

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ సీనియర్ నాయకుడు, ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొందిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కాటా వెంకటేశ్వర్లు(59) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

అంధకారంలో ముస్లిం కాలనీ

అనంతసాగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక చినగుండం వీధిలో దీపాలు లేక ప్రజలు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నారు. స్తంభాలకు ఎల్ఈడీలు వేయించాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, ఇకనైనా అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు కృషి

● ఏపీవో షేక్ సమీర్‌బాషా



లింగసముద్రం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామని మండల ఏపీఓ షేక్ సమీర్‌బాషా తెలిపారు. ప్రస్తుతం అన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నట్లు చెప్పారు. కూలీలకు సరిపడా వేతనం వస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ నుంచి రైతులకు పండ్ల తోటలకు సంబంధించిన పనులు చేపడతామన్నారు.

ఈ తరుణం...

? మండలంలో ఎంత మంది కూలీలు పని చేస్తున్నారు.

! ప్రస్తుతం 2వేల మంది వస్తున్నారు. కానీ రోజూ 5వేల మంది కూలీలు రావాల్సి ఉంది. అయితే వ్యవసాయ పనులకు ఎక్కువ మంది కూలీలు వెళుతున్నారు. రాబోయే రోజుల్లో కూలీల సంఖ్యను పెంచుతాం.

? రోజువారి కూలి వేతనం ఎంత వస్తుంది.

! రోజుకు సరాసరిన రూ.250 నుంచి రూ.300కూలి వేతనం వచ్చేలా పనులు చేయిస్తున్నాం. రోజులో 4నుంచి 5గంటలు పనిచేయాల్సి ఉంటుంది.

? ప్రస్తుతం ఎలాంటి పనులు చేస్తున్నారు.

! రైతులకు ఉపయోగపడే పంట కాలువల పూడికతీత, ఫారంపాండు పనులు చేయిస్తున్నాం. రాబోయే ఏప్రిల్‌లో రైతులకు ఉద్యానవన పంటలకు సంబందించిన పనులు చేపడతాం.

న్యూస్ బాక్స్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అల్లూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని సామాజికవేత్త మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోజురోజుకు సమాజంలో వాయు, ధ్వని, జల కాలుష్యం పెరిగిపోతుందని దీనికి మనమే కారకులమన్నారు. అడవులను కాపాడుకోవడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని అదేవిధంగా గ్రామాల్లో, పట్టణాల్లో చెట్లను తొలగించడమే తప్ప మొక్కలు నాటే వారు కరువయ్యారని వాపోయారు. పట్టణాలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యమైన సమాజంను నెలకొల్పి వ్యాధులకు దూరం కావాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సంగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఎం శ్రావణ్ కుమార్, పి మణి మృధుల బీపీ, షుగర్, బీఎంఆర్, కీళ్ల వాతం పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బందితో పాటు నిర్వాహకులు వాసు, కోటారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

కావలిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు ఆదివారం శ్రీనివాస జూనియర్ కళాశాల నిర్వాహకులు 7కుర్చీలు వితరణగా ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ మాట్లాడారు. పాఠశాలలో కుర్చీల కొరత ఉందని చేసిన విన్నపం మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజి యాజమాన్యానికి హెచ్ఎం కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

కందుకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికురాలు జంగిలి రోశమ్మ ఆదివారం మార్కెట్ సెంటర్‌లో మినీ లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. సహచర కార్మికులు ఆమెను తక్షణం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ నాయకులు బి. సురేష్‌బాబు, వై. ఆనంద్‌మోహన్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.

గిరిజన కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం

అనంతసాగరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఉత్తర కాలువ చైర్మన్ కృష్ణారెడ్డికి సమస్యను సాగరం చెరువు సొసైటీ అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ తెలపడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఇంతియాజ్, నాయకులు అవినాష్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, ఖాసింబాష తదితరులు పాల్గొన్నారు.





జలకాలాటలు సరే...
జాగ్రత్త మరి..!

నగరంలోని పొర్లుకట్ట వద్ద పెన్నా నదిలో సరదగా ఈత కొడుతున్న పిల్లలు

వేసవి వచ్చేసింది. అప్పుడే ఎండ మండిపోతోంది. చల్లటి నీటితో సేద తీరాలని ఎవరైనా కోరుకుంటారు. అందుకనే పెన్నా నదిలో ఈతకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చిన్నారులు, యువత తీరిక దొరికితే నెల్లూరు చెరువులో, పెన్నానదిలో జలకాలాటల్లో మునిగి తేలుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా నదిలో ఊబులు ఉండటంతో తస్మాత్ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. గతంలో ఎంతో మంది ఈతాడుతూ ప్రాణాలు పోగొట్టుకున్న విషాద ఘటనలున్నాయి. అధికారులు కూడా ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి వాటి దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

నమామి సుందరేశ్వరా..!

రాజరాజేశ్వరి ఆలయంలో నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని సుందరేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 28వతేదీ వరకు జరగ నున్నాయి. సోమవారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 25వతేదీ ఉదయం 7 గంటలకు ధ్వజారోహణ, కలిశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, రుద్రాభిషేకం, రుద్రహోమాలు జరగనున్నాయి. సాయంత్రం 6గంటలకు వేద పారాయణం, నాదస్వర కచేరీ, కుంభ హారతులు, రాత్రి రావణసేవ అలంకారంలో స్వామివారు దర్శనమిస్తారు. 26వతేదీ మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5గంటలకు విఘ్నేశ్వరపూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, గిన్నెభిక్ష అలంకరణ, రాత్రి 10గంటలకు లింగోద్భవకాల అభిషేకం, 12గంటలకు నందిసేవ, నగరోత్సవం జరగను న్నాయి. 27వతేదీ ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, వేదపారాయణం, సాయంత్రం మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ జరుగుతాయి. 28వతేదీ ఉదయం రుద్రాభిషేకాలు, రుద్రహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, ధ్వజావరోహణం, రాత్రి 7గంటలకు ప్రాకారోత్సవం, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. భక్తులందరూ ఉత్సవాలకు తరలిరావాలని ఆలయ ఈవో, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



మూలస్థానేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆహ్వానం పలికి, వేదాశీస్సులు అందజేస్తున్న ఆలయ అర్చకులు

● నీలకంఠేశ్వరుడికి పురుషామృగ వాహన సేవ

నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వర స్వామి ఆలయ సమీపంలోని అన్నపూర్ణా సమేత నీలకంఠేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం 3వరోజు ఉదయం విశేష పూజలు, హోమాలు జరిగాయి. రాత్రి స్వామివారికి పురుషామృగ వాహన సేవ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు.



విద్యుద్దీపాలంకరణలో సుందరేశ్వర స్వామి ఆలయం

కలాం సైంటిఫిక్ పరీక్షకు 1250 మంది

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఈ అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో నగరంలోని హిమాలయ పాఠశాలలో ఆదివారం 11వ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహించారు. అకాడమీ సీఈవో డాక్టర్ భువనగిరి ఫణి పవన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల కోసం దశాబ్ద కాలంగా ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం జరిగిన పరీక్షకు రాష్ట్రంలో 17,500 మంది విద్యార్థులు, నెల్లూరులో 25 పాఠశాలల నుంచి 1250 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, రీజనింగ్ వంటి అంశాల్లో 100 బిట్స్‌తో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షను విజయవంతంగా నిర్వహించామన్నారు. రాష్ట్రస్థాయిలో తరగతుల వారీగా మొదటి మూడు ర్యాంకులు సాధిం చిన విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన గుంటూరులో జరిగే అభ్యాసోత్సవ్‌లో నగదు బహుమతులు, ప్రోత్సాహక ఒలంపియాడ్ కిట్స్ అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జోనల్ మేనేజర్ బీ సాయిరామకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, ప్రతినిధులు లీలాకృష్ణ, మునీంద్రరెడ్డి, కిషోర్, రామ్ ప్రసాద్ తదితరులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్ష కరపత్రాలు ప్రదర్శిస్తున్న అభ్యాస్ ప్రతినిధులు

రోటరీ క్లబ్‌కి 120 వసంతాలు

● రోటేరియన్ సతీష్‌కుమార్



నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సేవా సంస్థల్లో ఒకటైన రోటరీ ఇంటర్నేషనల్ 120 సంవత్సరాలు పూర్తి చేసుకుందని రోటేరియన్ ఎం సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆయన కార్యాలయంలో రోటరీ క్లబ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్, జేసీఐలకన్నా ముందు ఏర్పడిన సంస్థ రోటరీ అన్నారు. 1905 ఫిబ్రవరిలో దీనిని స్థాపించారని, తొలి సమావేశం 1910లో జరగ్గా 1917 నాటికి అమెరికాలో 50 క్లబ్‌లకు చేరిందని చెప్పారు. కెనడా, యూరప్, ఆసియాలకు రోటరీ క్లబ్ విస్తరణ జరిగి 1930 నాటికి ప్రపంచ వ్యాప్తంగా 2వేల శాఖలు ఏర్పడ్డాయన్నారు. 1950లో రోటరీ తొలి అంతర్జాతీయ సేవా ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. పోలియో నిర్మూలనకు రూ.1.8 మిలియన్ డాలర్లను ప్రపంచ దేశాలకు విరాళంగా ఇచ్చిందన్నారు. విద్యా, వైద్యం, ప్రకృతి వైపరీత్యాలతో ప్రభావితమైన గ్రామాలకు, ప్రజలకు రోటరీ చేయూతనిస్తోందన్నారు.

ఆదిశేషుపై వేంకటేశుడు

వైభవంగా ధ్వజారోహణం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 23: స్థానిక రామకృష్ణానగర్‌లో కొలువైవున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనిచ్చారు. ఉదయం ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ధ్వజారోహణం కార్యక్రమానికి శ్రీ భావనారుషి, భద్రావతి అమ్మవారి ఆలయ కమిటీ, శేషవాహన సేవకు చెవ్వు సంపూర్ణమ్మ కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించారు.



ఘంటసాల వర్ధంతి
అలరించిన సంగీత విభావరి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పురమందిరం వర్ధమాన సమాజంలో పద్మశ్రీ ఘంటసాల 51వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా కోలాటం, పండరి భజన ప్రదర్శనలతోపాటు ఘంటసాల పాడిన పాటల సంగీత విభావరి అలరించింది. ఈ కార్యక్రమాల్లో పాటూరి శ్రీనివాసులు, పీ అమానుల్లా ఖాన్, కేతా సుబ్బారావు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

కూరగాయలలో.. కూరగాయలు!

● నగరంలో పెరిగిన వెజిటబుల్స్ వ్యాపారం ● రోడ్ల పక్కన, జంక్షన్లలో అమ్మకాలు ● బైకులపై ఇళ్ల వద్దకు..



నగరంలో ప్రధాన రహదారి పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో కూరగాయల వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో కూరగాయల సాగు, దిగుబడి గణనీయంగా పెరగడంతో వ్యాపారులు నేరుగా రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది మార్కెట్లలోని దుకాణాల్లో వ్యాపారం సాగిస్తుండగా మరికొంత మంది మాత్రం బైకులు, ఆటోల్లో ఇళ్ల వద్దకే తీసుకెళ్లి అమ్మకాలు సాగిస్తు న్నారు. తోపుడు బండ్లతోపాటు, రహదా రులు, జంక్షన్లలో కాస్త స్థలం దొరికితే చాలు అక్కడ కూరగాయలు అమ్మేస్తు న్నారు. నగరంలో ఎక్కడ చూసినా ప్రస్తుతం ఈ మొబైల్ కూర గాయల వ్యాపారం జరుగుతోంది. స్థానికంగా ఉన్న దుకాణ నిర్వాహకులు అధిక ధరలకు విక్రయాలు సాగిస్తుండడంతో మొబైల్ కూరగాయల వ్యాపారులకు బాగా కలిసి వస్తోంది. దుకాణాల్లో కిలో టమోటా రూ.25కు అమ్ముతుండగా రోడ్ల పక్కన, వాహనాలపై రూ.100కు ఐదు కిలోలు ఇస్తున్నారు. వంకాయలు, ఉర్లగడ్డలు, క్యారెట్, ఎర్రగడ్డలు, దొండకాయలు, గనిసిగడ్డలు, క్యాలీఫ్లవర్, దోసకాయలు, బీరకాయలు, చామగడ్డలు, అల్లం... ఇలా అన్నీ రకాల కూరగాయలు సరసమైన ధరలకు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ధర తక్కువ కావడం, ఫ్రెష్ సరుకు ఉండటంతో ప్రజలు కూడా వీరివద్ద కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో వారి వ్యాపారం జోరుగా సాగుతోంది.


పాఠశాలకు బెంచీల వితరణ

విడవలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1972-73వ సంవత్సరం 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం 25 బెంచీలను వితరణ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాఠశాలకు 53 బెంచీలను ఇవ్వటం జరిగిందన్నారు. అదేవిధంగా పూర్వ విద్యార్థులు సోమవరపు జనార్ధన్ రెడ్డి, దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, మహంకాళి ప్రభాకర్, ఉప్పలమర్తి కృపాకర్‌రెడ్డి, కాకు సుబ్రమణ్యం సహకారంతో సుమారు రూ. 90వేలతో డైనింగ్ హాల్ పునరుద్ధరించి విద్యార్థులకు భోజనానికి ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి జనార్ధన్‌రెడ్డి పాఠశాలకి కంప్యూటర్‌ని వితరణ చేశారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ, పొనక కనకమ్మ విగ్రహాలకు పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, కొత్తూరు బయాలజీ ఉపాధ్యాయులు పీవీ శేషయ్య, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



దాసరి విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మొమెంటోలు అందజేశారు. అలాగే మార్చి నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి దాసరి సుహాసినీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేలు ప్రోత్సాహక బహుమతిగా అందజేయనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్రనాయుడు, అపస్ నాయకులు, బి కేశవరావు, బి సుబ్బరాయుడు, దొడ్ల మల్లికార్జున, సూరి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలక మండలి సభ్యులు

ఉదయకాళేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా ఆలం మాలకొండయ్య

కొడవలూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండవరం గ్రామంలో గంగా పార్వతి సమేత ఉదయకాళేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ఆలం మాలకొండయ్య ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పటాభిరామిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలం మాలకొండయ్యతోపాటు వైస్ చైర్మన్ చీకటి ప్రదీప్‌రెడ్డి, మరియు 10 మంది పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలం మాల కొండయ్య మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతను అప్పగించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లా డుతూ ఉదయకాళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు జరుగు తాయని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండి శాంతయ్య, పాలక మండలి సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చోళులకాలం నాటి పురాతన శివాలయంలో మంగళవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీకామాక్షితాయి సమేత రామలిం గేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పీబీ.ఎస్వీ ప్రసాద్‌రావు, ఈఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శివాలయంలో ప్రసాద్ స్వామి మాట్లాడారు. మంగళవారం సాయంత్రం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ, రావణసేవ కార్యక్రమాలు ఉంటాయని, కోడూరు శ్రీనివాసులు, దేవాంగ సంఘం సభ్యులు వీటికి ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. బుధవారం రాత్రి మహాశివరాత్రి పురస్కరించుకుని లింగోదర్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నందిసేవ ఉంటుందని, ఉభయకర్తలుగా రైతు సంఘం సభ్యులుగా ఉంటారని చెప్పారు. మహాశివరాత్రి రోజున భక్తులకు అన్నదానం చేపడతామన్నారు. బ్రహ్మోత్సవాలకు మండలం నుంచే కాక చుట్టుపక్కల మండలాలు, ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలి వస్తారని చెప్పారు.

గుర్రాలమడుగు సంఘంలో వైద్య శిబిరం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ, మెడికవర్ ఆసుపత్రి, కార్తికేయ డెంటల్ వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని గుర్రాల మడుగు సంఘంలో వైద్యశిబిరం నిర్వహించారు. దీనిని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సందర్శించారు. జనసేన నాయకులు గునుకుల విజయలక్ష్మి, నరహరి, వెంకటరమణను అభినందించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలు ప్రతి ఒక్కరికి రూ.25 లక్షల బీమా వర్తించేలా రానున్న ఆర్థిక సంవత్సరంలో బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ప్రజలకు అండగా నిలిచేలా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి కార్యక్రమా లు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా పర్యవేక్షకు డు నూనె మల్లికార్జున యాదవ్, నాయకులు సుందర్ రామిరెడ్డి, జమీర్, గునుకుల కిషోర్, విజయలక్ష్మి, చంద్ర శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, పక్కన నాయకులు

ఏసీ స్టేడియంలో...

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, నేతలు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, నలుబోలు బలరామయ్య నాయుడు, సభ్యులు పాల్గొన్నారు

ప్రశాంతంగా గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షలు

వెంకటాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాబా ఇంజనీరింగ్ కళ్యాలలో ఆదివారం జరిగిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలలో 480 మంది అభ్యర్థుల్లో 424 మంది హాజరయ్యారు. భద్రతా ఏర్పాట్లను సీఐ సుబ్బారావు, ఎస్ఐ అంజనేయులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా ఉన్నతాధికారులు సైతం పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఐ సుబ్బారావు

బీఎస్-6 వాహనాలపై అవగాహన

వెంకటాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాకుటూరు పంచాయతీ గొలగమూడి క్రాస్ రోడ్డులోని పరిశ్రమల కేంద్రంలో ఆదివారం బీఎస్-6 వాహనాలపై మోటర్ బైక్ మెకానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టూ వీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దయానేని ధర్మ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ బద్రుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవాస్తవ కంపెనీ నిర్వాహకులు బీఎస్-6 బైక్‌ల రిపేరీపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసాయి మహదేవ్ స్పేర్స్ అధినేత వెంకట్‌సునీల్, రేప్సెల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి గిరీష్‌కుమార్, శ్రీవాస్తవ కంపెనీ ప్రతినిధులు అభిజిత్, లక్ష్మణరావు, మనోజ్ తదితరులు ఉన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న బద్రుద్దీన్

ఎమ్మెల్యే కాకర్లపై ఆరోపణలు అర్థరహితం : మాజీ ఎమ్మెల్యే కంభం

వింజమూరు(ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం కంభం విజయరామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, నాయకులు గణపరం సుదర్శన్‌రెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, శ్రీనివాసులు, నాగిరెడ్డి, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.



చేపలు అధరహో

'బర్డ్ ఫ్లూ' ప్రభావంతో చికెన్ కొనుగోళ్లు పడిపోయాయి. చేపలకు గిరాకీ పెరిగింది. దీంతో చేపల రకాలను బట్టి కిలోపై రూ.30 నుంచి రూ.వంద వరకు ధరలు పెరిగాయి. అయినా కొనుగోళ్లు తగ్గలేదు. ఆదివారం తిరుపతిలోని చేపల దుకాణాలు రద్దీగా కనిపించాయి. చికెన్ ధర తగ్గినా.. కొనేవాళ్లు లేక దుకాణాలు వెలవెలపోయాయి.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన అలిపిరి

తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి తనిఖీ కేంద్రం ఆదివారం వాహనాలతో కిక్కిరిసింది. తిరుమలలో భక్తుల క్యూలైన్ బయటకు వ్యాపించకపోయినా, అలిపిరిలో మాత్రం వాహనాలు క్యూకట్టాయి. ఇటీవల సొంత వాహనాల్లో తిరుమలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. దీంతో రద్దీ మోస్తరుగానే ఉన్నప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రంలో మాత్రం వాహనాలు బారులు తీరుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రేణిగుంటకు సీఎం చంద్రబాబు

● నరసింహ యాదవ్ తనయుడి వివాహానికి హాజరు



వధూవరులను ఆశీర్వదించాక, నరసింహయాదవ్ కుటుంబ సభ్యులతో సీఎం



చిన్నారితో చంద్రబాబు

తిరుపతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివారం రేణిగుంటకు వచ్చారు. తూకివాకం సమీపంలోని ఆర్పీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి పార్లమెంటరీ టీడీపీ కమిటీ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చిన ఆయన.. వధూవరులు సుదర్శన్ యాదవ్, పూజలను ఆశీర్వదించారు. వధూవరుల తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలసి గ్రూపు ఫొటోలు దిగారు. సుమారు అరగంట పాటు ఆయన పెళ్లి మండపంలో గడిపారు. అనంతరం విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో నెల్లూరు జిల్లా పర్యటనకు వెళ్లారు. కాగా, ఉదయం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎంకు పలమనేరు, చంద్రగిరి, నగరి, జీడీనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్, అనంతపురం డీఐజీ షిమోషి బాజ్‌పాయ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సాల్, మున్సిపల్ కమిషనర్ మౌర్య, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు ఘనస్వాగతం పలికారు.

అధినేత రాకతో..

టీడీపీ ఆవిర్భావం నుంచీ కొనసాగుతున్న నరసింహ యాదవ్.. తన కుమారుడి వివాహానికి అధినేత చంద్రబాబు హాజరు కావడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తొలి నుంచీ ఆయనకు సిన్సియర్ నాయకుడిగా గుర్తింపు ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా నియమించారు. ఎన్నికలకు ముందు నుంచీ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీ లేదా టీటీడీ చైర్మన్ పదవిని ఆశించారు. ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వగా.. ఆయన సంతోషంగా లేరు. తాను మరో రెండేళ్లయినా వేచి చూస్తానని, తనకు సముచిత పదవి ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరారు. ఆ మేరకు ఇప్పటికీ యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టలేదు. తాజాగా ఆదివారం అధినేత చంద్రబాబు కేవలం నరసింహ యాదవ్ తనయుడి వివాహానికే ప్రత్యేకంగా రావడం.. అరగంట పాటు వారితో గడపారు. ఇలా.. అధినేత తనకిచ్చిన ప్రాధాన్యతకు నరసింహ యాదవ్, ఆయన కుటుంబీకులకు సంతోషం కలిగించింది.



భాస్కర్ (ఫైల్‌ఫొటో)

లారీ ఢీకొని ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పుదూరు సమీపంలో మోటారుసైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఏఆర్ కానిస్టేబుల్ భాస్కర్ (39) దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు... నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భాస్కర్.. చిట్టమూరు మండలం ఈశ్వరవాకలో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం విధులకు హాజరయ్యేందుకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. భాస్కర్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంకర్‌నాయక్ అరెస్టుతో

తిరుపతిలో కలకలం





మాజీ సీఎం జగన్.. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డితో శంకర్ నాయక్

తిరుపతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ మాచవరంలోని ఓ స్పా సెంటర్‌లో వైసీపీ నేత వడిత్యా శంకర్‌నాయక్ పట్టుబడిన ఘటన తిరుపతిలో కలకలం రేపింది. ఈ శంకర్‌నాయక్ ఎవరు? అతడి నేపథ్యం ఏమిటన్న చర్చ రాష్ట్రవ్యాప్తంగా మొదలైంది. తిరుపతి కేంద్రంగా విద్యార్థి సంఘ ఉద్యమాల్లో అడుగుపెట్టి.. విద్యార్థి నేతగా, ఆపై ప్రజా సంఘ నాయకుడిగా, చివరికి రాజకీయ నేతగా మారిన శంకర్‌నాయక్.. తాజా నిర్వాకంతో ఆయన్ను తెలిసిన వారు విస్తుపోతున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలోని ఓ గిరిజన తాండాకు చెందిన వడిత్యా శంకర్ నాయక్ డిగ్రీ చదువు కోసం తిరుపతికి వచ్చారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ, ఎస్వీయూలో పీజీ చేశారు. తొలుత ఓ వామపక్ష విద్యార్థి సంఘంలో చేరి చురుగ్గా పనిచేశారు. అతడి వ్యవహార శైలి బాగాలేదని ఆ పార్టీ ముఖ్యనేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బయటికి వచ్చేశారని సమాచారం. తర్వాత గిరిజన విద్యార్థి సమాఖ్య ఏర్పాటు చేసి గిరిజన, ఆదివాసీల హక్కుల పరిరక్షణ పేరిట కార్యక్రమాలు కొనసాగించారు. ఆ సమయంలో టీటీడీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం గిరిజనుల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఏకంగా అట్రాసిటీ కేసు పెట్టారు. ఈ ఘటనతో గిరిజన వర్గాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. కొంతకాలం తర్వాత ఆ విద్యార్థి సమాఖ్యను గిరిజన ప్రజా సమాఖ్యగా మార్చి.. విజయవాడ, విశాఖపట్నం కేంద్రాలుగా రాజకీయ కార్యకలాపాలకు దిగారు. ఆ క్రమంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ.. గతంలో సీఎంగా ఉన్న చంద్రబాబును లక్ష్యంగా చేసుకొని విమర్శలు, ఆరోపణలు చేసేవారు. అలా వైసీపీ నాయకుల దృష్టిలో పడ్డారు. 2019 ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో ఒకరిద్దరు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం గట్టిగా పని చేసి వారి ప్రాపకం సంపాదించారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగా.. అప్పటి సీఎం జగన్ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి సన్నిహితుడయ్యారు. ఆ సాన్నిహిత్యంతో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. గిరిజన విద్యార్థి సమాఖ్య, గిరిజన ప్రజా సమాఖ్యల పేరిట సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో తరచూ జోక్యం చేసుకునే వారని, అధికారులను, సిబ్బందిని వేధించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎస్టీ కమిషన్ సభ్యుడిగా క్యాబినెట్ హోదా కలిగిన పదవిలో మరింత దూకుడుగా వ్యవహరించారన్న విమర్శలు లేకపోలేదు. తాజాగా విజయవాడ మాచవరం ప్రాంతంలో ఓ స్పా సెంటర్లో వ్యభిచారం నడుస్తోందని వచ్చిన ఫిర్యాదులతో పోలీసులు దాడి చేయగా అక్కడ శంకర్‌నాయక్ పట్టుబడ్డారు. ఓ గదిలోని మంచం కింద దాక్కుని ఉన్న ఫొటోలు, వీడియోలు బయటికి రావడంతో తిరుపతిలో విద్యార్థి ప్రజా సంఘాలు విస్తుపోతున్నాయి. ఎస్టీ కమిషన్ మెంబరుగా ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. కాగా, తిరుపతికి వచ్చిన ప్రారంభంలో పేదరిక నేపథ్యంలో ఉన్న ఆయన.. ఇప్పుడు ఆర్థికంగా మంచి స్థాయికి చేరారని అతడి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

భూత వాహనంపై

జగద్రక్షకుడు

ఉదయం.. పురవీధుల ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి అమ్మవార్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు భూతవాహనంపై.. జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చిలుక వాహనంపై ఊరేగారు. మూషికవాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. రాజగోపురం గుండా తేరువీధిలోకి ప్రవేశించి.. ఆ తర్వాత నెహ్రూవీధి, నగరి వీధి, బజారువీధిగుండా స్వామి అమ్మవార్ల ఊరేగింపు సాగింది. ఉదయం.. సూర్యప్రభ వాహనంపై పరమ శివుడు, చప్పరంపై అమ్మవారు ఊరేగారు. వీరిని మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. పురవీధుల్లో ఊరేగుతున్న పార్వతి, పరమేశ్వరులను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు. కోలాటాలు కనువిందుచేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భూత వాహనంపై శివయ్య, చిలుకపై అమ్మవారి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 9గంటలకు : హంస - యాళి వాహనసేవ
రాత్రి 8 గంటలకు : రావణుడు - నెమలి వాహనసేవ



శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కేంద్రానికి చేరుకుంటున్న అభ్యర్థులు

ప్రశాంతంగా

గ్రూప్-2 మెయిన్స్

ఉదయం 5,055, మధ్యాహ్నం 5,046 మంది హాజరు







చెప్పులు తీసి తనిఖీ - తనిఖీల్లో భాగంగా జడ రబ్బరు బ్యాండ్లను తీస్తూ.. - టైం అయిపోవడంతో అభ్యర్థి పరుగు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 13 కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 నుంచి 12.30 గంటలవరకు.. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 5,801మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. ఉదయం సెషన్‌లో 5,055 మంది పరీక్ష రాయగా, 746 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 5,046 మంది రాగా, 755 గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరిని పోలీసులు క్షుణ్నంగా తనిఖీచేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష రాసిన నవవధువు



నవవధువు జడను పరిశీలిస్తున్న సిబ్బంది

పసుపు వస్త్రాలు. తలపై జీలకర్ర, బెల్లం. కాళ్లకు పారాణితో నవ వధువు మమత ఆదివారం గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష రాశారు. తిరుపతికి చెందిన ఈమెకు ఉదయం చిత్తూరులో వివాహమైంది. అటు నుంచి నేరుగా తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. ఇలా కొత్త పెళ్లికూతురు పరీక్షా కేంద్రానికి రావడం ప్రత్యేకంగా నిలిచింది. ఇక, తలపై జీలకర్ర, బెల్లం తొలగించాలని సిబ్బంది చెప్పగా, ఆమె నిరాకరించారు. దీనిపై ప్రిన్సిపల్ నారాయణమ్మ ఉన్నతాధికారులతో మాట్లాడగా.. వారి సూచన మేరకు తనిఖీ చేసి ఆమెను పరీక్షకు అనుమతించారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



ఉన్నతాధికారులతో ఫోనులో మాట్లాడుతూ..

'తొక్కిసలాట'పై నేడు విజయవాడ నుంచి వర్చువల్ విచారణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో జస్టిస్ సత్యనారాయణమూర్తి బాధితులను విచారించనున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్‌ను నియమించిన విషయం తెలిసిందే. తిరుపతి కలెక్టరేట్ వేదికగా కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాణమూర్తి శనివారం రెండో దశ విచారణ చేపట్టారు. 11 మందిని విచారించారు. ఇదే ఘటనలో విశాఖకు చెందిన కొందరు మృతిచెందగా, మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. విచారణకు హాజరు కావాలని ఈ ప్రాంతానికి చెందిన 19 మంది బాధితులకు న్యాయవిచారణ కమిషన్ నోటీసులు జారీ చేసింది. అయితే తామింకా కోలుకోలేదని గాయాలు ఇబ్బంది పెడుతున్నాయని, అంత దూరం రాలేమని వర్చువల్(జూమ్) మీటింగ్‌లో పాల్గొని ఘటనపై వివరిస్తామని వారు కమిషన్‌కు లిఖితపూర్వకంగా వివరణ పంపించారు. దీంతో జస్టిస్ సత్యనారాయణమూర్తి ఆదివారం ఉదయం విజయవాడకు బయలుదేరి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వైజాగ్ గోపాలపట్టణం తహసీల్దారు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో న్యాయవిచారణ కమిషన్ ఎదుట బాధితులు హాజరు కానున్నారు. విజయవాడ నుంచి వర్చువల్ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి వారిని విచారించనున్నారు. కాగా, ఈ తొక్కిసలాట ఘటనలో గాయపడిన వారిలో కొందరు కేరళ, తమిళనాడుల్ల రాష్ట్రాల్లో ఉన్నారు. వీరూ వర్చువల్ విధానంలో విచారణకు హాజరుకానున్నట్లు తెలిసింది. దీని తర్వాత మూడో దశ విచారణ కీలకం కానుంది.

వైభవంగా స్వర్ణ రథోత్సవం

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను వాహన మండపానికి తీసుకొచ్చి విశేషంగా అలంకరించారు. అనంతరం స్వర్ణరథంపై అధిష్ఠింపచేసి సంకల్ప పూజలు నిర్వహించారు. స్వర్ణ రథానికి ఏర్పాటు చేసిన మోకులను గోవింద నామస్మరణ చేస్తూ టీటీడీ అధికారులు, భక్తులు నెమ్మదిగా లాగారు. స్వామివారు ఆలయ తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, స్వామివారు ఉదయం హనుమంతు వాహనం, రాత్రి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



నెర్రికాలువ నిండా వ్యర్థాలే



సూళ్లూరు వాటంబేడు రోడ్డు వద్ద నెర్రికాలువలో వ్యర్థాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరందించే నెర్రికాలువ వ్యర్థాలతో నిండి మురికి కుంటను తలపిస్తోంది. సూళ్లూరుపేట మండలంలో గోపాలరెడ్డిపాలెం, కుదిరి, కోటపోలూరు, ఎస్వికండ్రిగ, పిండిపాలెం గ్రామాలతో తడ, దొరవారిసత్రం మండలాల్లో సుమారు 15 వేల ఎకరాలకు నెర్రికాలువ నుంచి సాగునీరు అందుతుంది. దొరవారిసత్రం మండలం తనియాలి వద్ద ప్రారంభమయ్యే నెర్రికాలువ సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డున మీదుగా పోయి తడ మండలం వాటంబేడు వద్ద ముగిస్తుంది. సూళ్లూరుపేట పట్టణంలోని వ్యర్థపునీరు నెర్రికాలువలో కలుస్తుండంతో మురికి కూపంలా మారి దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే హోలిక్రాస్ కూడలి నుంచి చెంగాళమ్మ ఆలయం వాటంబేడు రోడ్డు వద్ద కాలువ అంచు వరకు వ్యర్థాలతో నిండిపోయింది. రైతుల వరప్రసాది అయిన నెర్రికాలువను వ్యర్థాల బారినుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని భావిభారత ఇంజనీర్లుగా ఎదగాలని ఎన్‌బీకేఆర్ కళాశాల డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గాయత్రి పాఠశాలకు చెందిన విద్యార్థులు టెక్నికల్ నాలెడ్జ్ హంట్‌లో భాగంగా విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో వివిధ విభాగాలను పరిశీలించి అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలోని వివిధ శాఖలు, అనుబంధ ప్రయోగశాలలు, రోబోట్ టెక్నాలజీ వంటి ఇతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. దీంతో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు వారిలో కొత్త ఆలోచనలను ఆవిష్కరించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని సీఎస్‌తేజ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలిసి ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయుడుపేట, సూళ్లూరుపేటలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రెండు మున్సిపాలిటీల్లో కౌన్సిళ్లు ఆమోదించడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది ఎన్టీఆర్ జయంతి రోజున ఆయన విగ్రహాలను ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, వేలూరు మురళీకృష్ణారెడ్డి, సంచి కృష్ణయ్య, బాసల గంగాప్రసాద్, మైలారి రాజశేఖర్, కొడాలి రవిబాబు, శోభన్‌కుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శ్రీనివాసులురెడ్డి వర్ధంతి



శ్రీనివాసులురెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో ఆదివారం మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి వర్ధంతి నిర్వహించారు. బజారు సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ, వైసీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీలో శ్రీనివాసులురెడ్డి సతీమణి శ్రీలక్ష్మమ్మ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.

కేశవరంలో ఉచిత వైద్యశిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవరంలో ఆదివారం టీడీపీ నాయకులు, ప్రముఖ బిల్డర్ మర్రిబోయిన రాజేంద్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. గూడూరుకు చెందిన చిన్నపిల్లల డాక్టర్ త్రివిక్రమరావు, గర్భకోశవ్యాధి నిపుణురాలు డాక్టర్ కీర్తి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రాజేంద్ర ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీనేతలు కోటేశ్వరప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 13 గంటలు

తిరుమల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



మృతిచెందిన వినీల్

నాయుడుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచివాడపాళెం గ్రామానికి చెందిన వినీల్(19) స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఆదివారం వినీల్ స్నేహితులతో కలిసి స్వర్ణముఖినదిలోకి ఈతకు వెళ్లాడు నదిలో లోతట్టు ప్రాంతంలోకి వెళ్లిన వినీల్ అకస్మాత్తుగా మునిగి మృతి చెందాడు. గమనించి స్నేహితులు వెంటనే గ్రామస్తులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు వినీల్ మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు.

మామిడికాలువలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలో ఉన్న మామిడి కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన మేనకూరువాసులు మామిడికాలువలో మృతదేహం ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సీఐ బాబి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

కండలేరు వాగుపై లోలెవల్ కాజ్‌వే నిర్మించండి

- శ్మశానానికి, పొలాలకు వెళ్లడానికి అవస్థలు
- తాత్కాలికంగా మట్టిరోడ్డు నిర్మించుకున్న రైతులు



కండలేరువాగులో రైతులు ఏర్పాటు చేసుకుని ఉన్న మట్టిరోడ్డు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలంలోని సంతదాసుపల్లి వద్ద కండలేరువాగుపై లోలెవల్ కాజ్‌వేను నిర్మించాలని రైతులు కోరుతున్నారు. వాగు అవతల వైపు ఉన్న శ్మశానవాటికకు, పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో రైతులే స్వయంగా వాగుపై మట్టిరోడ్డును తాత్కాలికంగా నిర్మిచుకున్నారు. మండలంలోని సంతదాసుపల్లి వద్ద కండలేరువాగు ప్రవహిస్తోంది. పెంచలకోన ప్రాంతం నుంచి మనుబోలు మండలం మీదుగా తిప్పగుంటపాళెం గ్రామంలోని కండలేరు క్రీక్‌లో కలిసే ఈ వాగు నీరు సముద్రంలోకి చేరుతుంది. సంతదాసుపల్లివాసులు కండలేరువాగును దాటితేనే శ్మశానవాటికకు వెళ్లాల్సి ఉంటుంది. అంతేకాకుండా వాగు అవతల సుమారు 400 ఎకరాల వరకు పంట పొలాలకు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. వాగులో నీరు ప్రవహించే సమయంలో అలువైపు వెళ్లలేని పరిస్థితి. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని వాగుఅవతల ఉన్న శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలంటే గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. వాగు అవతల ఉన్న పొలాల్లో పంటలు సాగు చేసుకునేందుకు ఎరువులు, ఇతర వస్తువులు తీసుకువెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. మూగ జీవాలను మేతకు తీసుకువెళ్లి తిరిగి వచ్చే సమయంలో వాగులో నీటి ఉధృతికి ఓ వ్యక్తి కొట్టుకుపోయి మృతిచెందిన ఘటనలు చోటు చేసుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో రైతులే స్వయంగా గ్రామం నుంచి వాగు అవతలకు దాటేందుకు తాత్కాలికంగా మట్టిరోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. అయితే వర్షాల సమయంలో, కండలేరు డ్యాం నుంచి సముద్రంలోకి నీటిని వదిలే సమయంలో వాగులో ప్రవాహం పెరిగి మట్టిరోడ్డు మునిగిపోయి రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కండలేరు వాగుపై లోలెవల్ కాజ్‌వేను నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు రైతులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ మేరకు లోలెవెల్ కాజ్‌వేను నిర్మించేందుకు రూ.1.27 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి త్వరిగతిన లోలెవెల్ కాజ్‌వేను నిర్మించి దారి సౌకర్యం కల్పించాలని సంతదాసుపల్లివాసులు కోరుతున్నారు.





శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన నాగేశ్వరస్వామి ఆలయం - రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్ వెలుగులు

నేటి నుంచి నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలను పురష్కరించుకొని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక జీఎన్‌టీ రోడ్డు నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం చుట్టూ వివిధ దేవతామూర్తుల ఆర్చీలు విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్నాయి. సోమవారం సాయంత్రం చెంగాళమ్మ ఆలయం నుంచి పుట్టమట్టి తెచ్చి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. 25న ఆలయం వద్ద హోమం, 26న మహాశివరాత్రి సందర్భంగా అభిషేకాలు, విశేష పూజలు. 27న కల్యాణోత్సవం, 28న గ్రామోత్సవం, మార్చి 1న వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు నిధులేవీ?



మీడియాతో మాట్లాడుతున్న కందమూడి శివకుమార్, పక్కన కందమూడి పళని, ఆరూరు ప్రకాశ్ పాల్గొన్నారు.

పెళ్లకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో నిధులు లేకుండా సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఎలా సాధ్యమని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన జీలపాటూరులోని పంచాయతీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం పేరుతో చేపట్టిన చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పంచాయతీలకు కష్టతరంగా మారుతోందన్నారు. గత ప్రభుత్వం నిధులను దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విడుదల చేసిన నిధులు తాగునీటి సమస్యలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులకే సరిపోతున్నాయని తెలిపారు. పంచాయతీ పరిధిలో చెత్త సేకరించడానికి రోజు ఇద్దరు కార్మికులను నియమించుకుంటే వారికి జీతాలు చెల్లించడానికి నిధులు లేవన్నారు. గతంలో సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువు తయారీ చేసి కిలో రూ.10కే అమ్ముతామని ప్రకటించినా ఎవరూ కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలన చేసి గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని శివకుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కందమూడి పళని, ఆరూరు ప్రకాశ్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, కరీముల్లా, రాము, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ



మోపూరువెల్లంపల్లిలో చెత్త సేకరిస్తున్న కార్మికులు, అధికారులు

డక్కిలి, ఫిబ్రవరి 23: గ్రామాల్లో చెత్త సేకరణ నిరంతర ప్రక్రియ అని ఈవోపీఆర్డీ అల్లాభక్షు అన్నారు. ఆదివారం మోపూరు వెల్లంపల్లి పంచాయతీలో చెత్త సేకరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కార్యదర్శులు, సర్పంచులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల అందజేత



పేదలకు దుస్తులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సరస్వతీ శిశు మందిరంలో పేదలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు, దుప్పట్లు, నిత్యావసరాలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, రియాజ్‌అహ్మద్, రవిచంద్ర, రాధాకృష్ణ, మురళీరెడ్డి, రూపేష్‌రెడ్డి, ఎంవీ రమణయ్య, కల్యాణ్‌సాయి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైసీపీ నాయకుడికి నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు ఆదిరెడ్డి మల్లిరెడ్డి ఇటీవల గెండెపోటుకు గురై చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి మల్లిరెడ్డిని పరామర్శించారు.

చెత్త బుట్టల పంపిణీ



చెత్త బుట్టలు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి శాంతి

పెళ్లకూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు, జీలపాటూరు పంచాయతీల్లో ఆదివారం చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిల్లకూరు పంచాయతీ కార్యదర్శి శాంతి మాట్లాడుతూ రెండు పంచాయతీల పరిధిలోని ఐదు గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రతి ఇంటికీ రెండు బుట్టలను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు కందమూడి శివకుమార్, సన్నారెడ్డి వేణురెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు

కోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు ప్రేరణ తరగతులు నిర్వహించారు. పరీక్షా సమయంలో ఏకాగ్రతపై ఉపాధ్యాయుడు సునీల్ వివరించారు. కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట ఏఎస్‌డబ్ల్యువోలు మనోజ్, సుధామణి, వార్డెన్లు పద్మజ, ఉషా, రవి, కన్నన్, మహేంద్ర, సరిత తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు అంబేడ్కర్: పనబాక

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఆరాధించే వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి పేర్కొన్నారు. తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. తపాలా కార్యాలయ ప్రాంగణంలో గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య, నాయకులు పరమశివం, ప్రసాదరావు, ఐతేపల్లి రవి, పల్లం రెడ్డెప్ప, పి.మునిరాజ పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోండి



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కాంట్రాక్టు ఇచ్చే విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆదివారం మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే విధంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు ఇస్తే కార్మికులు వేధింపులకు గురికావాల్సివస్తుందని, వేతనాలను సకాలంలో చెల్లించరని, పీఎఫ్, ఈఎస్‌ఐ నిధులు గోల్‌మాల్ అయ్యే ప్రమాదం వుంటుందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ప్రతిపాదనలను విరమించుకుని ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శివకుమార్, కోటేశ్వరరావు, వెంకటరమణ, రాజేష్, మణి, రాఘవ, సంపూర్ణమ్మ, మణెమ్మ, బీవీ రమణయ్య, సురేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ కల్యాణం



అశ్వర్థ వృక్షం, నింభ వృక్షాలకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా ఆదివారం లక్ష్మీ నారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న అశ్వర్థ, నింభ వృక్షాలకు వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. ముందుగా వృక్షాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలనంతరం అశ్వర్థ, నింభ వృక్షాలకు జిలకర బెల్లం పెట్టి మాంగల్యధారణ చేశారు. ఉభయదాతలుగా సారంగపాణి మస్తాన్ నాయుడు దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ ఐతా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై పార్కింగ్ చేసిన లారీలకు జరిమానా



లారీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరపేట హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రెండు రోజుల క్రితం పోలీసులు నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే వాహనదారులు నిబంధనలు పాటించకుండా నో పార్కింగ్ బోర్డులున్న చోటే ఆదివారం లారీలు ఆపారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు వాహనాల డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఐదు లారీలకు రూ.1000 చొప్పున జరిమానా విధించారు. మరోసారి జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

లారీ ఢీకొని మోటరు సైక్లిస్టుకు గాయాలు

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం జాతీయ రహదారిపై ఆదివారి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని పోటుపాళెం గ్రామానికి చెందిన చంద్ర గూడూరుకు వచ్చి తిరిగి గ్రామానికి మోటరు సైకిల్‌పై వెళుతుండగా పోటుపాళెం కూడలి వద్ద ఓ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటరు సైకిల్‌పై ప్రయాణిస్తున్న చంద్రకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 10 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అలిపిరి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలిక ఇంటి సమీపంలో పిల్లలతో ఆడుకుంటోంది. అదే ప్రాంతానికి చెందిన రమణాచారి మద్యం మత్తులో ఆ చిన్నారిని బలవంతంగా తన ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. లైంగిక వేధింపులకు గురిచేశాడు. బాలిక అతని నుంచి తప్పించుకుని పెద్దగా కేకలు వేస్తూ ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం చెప్పింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.